



## నేడు నిక్షయ్ శిబిరం ప్రారంభం

పెద్దపల్లి, డిసెంబర్6: గర్రెపల్లి పీహెచ్‌సీలో నిక్షయ్ శిబిరాన్ని శనివారం ప్రారంభిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ అన్న ప్రసన్న కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిక్షయ్ శిబిరం కార్యక్రమం 100 రోజుల పాటు జరుగుతుందన్నారు. టీబీపై అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు నిర్వహించి క్షయ వ్యాధి కేసులను నిర్ధారిస్తామని తెలిపారు. టీబీ చికిత్స అందించి క్షయను నివారించడం నిక్షయ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజలు భాగసామ్యులై టీబీ రహిత జిల్లాగా రూపొందించేందుకు సహకరించాలని కోరారు.

## ఆటోక్యాబ్ బంద్‌ను జయప్రదం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 6 ః ఆటో, క్యాబ్ డ్రైవర్ల సమస్యలపై ఈ నెల 7న తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి బీ. అశోక్ కోరారు. తెలంగాణ చౌరస్తాలో ఆటో యూనియన్ ప్రతినిధులు శుక్రవారం బంద్ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రతినిధులు ఎడ్ల రవి కుమార్, రవీందర్, దిడ్డీ లక్ష్మణ్, గోపి, షఫీ, శ్రీనివాస్, నాగేందర్, కనకరాజు, నాగరాజులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ ఆలయంలో చోరీ

సుల్తానాబాద్ రూరల్, డిసెంబర్ 6 : చిన్నకల్వలలోని రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తాళం పగులగొట్టి 6 తులాల వెండి ఆభరణాలు, పుస్తె మట్టెలు అపహరించారు. హుండీ పలగొట్టడానికి ప్రయత్నించారు. సంఘటనా స్థలానికి సుల్తానాబాద్ పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు.

## ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించాలి

సుల్తానాబాద్, డిసెంబర్ 6 : ఇంటర్మీడియట్ వార్షిక పలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు కూడా సహకరించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి అన్నారు. కళాశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి, ప్రవర్తన, కళాశాల అభివృద్ధిపై చర్చించారు. సమావేశంలో శీలం శంకర్, అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులున్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన పుట్ట మధూకర్



వధూవరులతో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

కమాన్‌పూర్, నవంబర్ 30 : మండలంలోని రొంపికుంట గ్రామానికి చెందిన కొయ్యడ కొమురమ్మ-మల్లయ్య దంపతుల కూతురు వివాహం శుక్రవారం స్వగ్రామంలో జరుగగా, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హాజరై నూతన వధూవరులు అనిత-మహేష్‌ను ఆశీర్వదించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## అనుమతి లేకుండా వేస్తున్న బోర్ సీజ్

రామగిరి, డిసెంబర్ 6: మండలంలోని బేగంపేట శివారులో అనుమతులు లేకుండా వేస్తున్న బోర్‌ను శుక్రవారం తాసీల్దార్ రాంచందర్ రావు ఆధ్వర్యంలో జిల్లా భూగర్భ జల శాఖ కార్యాలయం అధికారులు పరిశీలన చేసి బోర్‌ను సీజ్ చేశారు. అలాగే బోర్‌వెల్ రిగ్‌కి జరిమానా విధించారు. ఇకపై ప్రతి బోరు తవ్వేందుకు అనుమతి తప్పనిసరి లేనిచో తవ్వించుకునే వారికి, బోర్ వెల్ రిగ్‌కు లక్ష రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

# ఇంటికి చేరిన మావోయిస్టు మల్లయ్య మృతదేహం

- కడసారి చూపునకు తండోపతండాలుగా వస్తున్న సమీప గ్రామాల ప్రజలు
- కంటినిండా దుఖంతో మావోయిస్టు మల్లయ్య కుటుంబసభ్యులు
- అంత్యక్రియలకు ప్రజాసంఘాలు, గ్రామస్తుల ఏర్పాట్లు



రాణాపూర్ గ్రామం చేరిన మావోయిస్టు ఎగోలపు మల్లయ్య మృతదేహం



మల్లయ్య (ఫైల్)

పాలకుర్తి, డిసెంబర్6: మూడు దశాబ్దాలు మవోయిస్టు ఉద్యమంలో పీడిత ప్రజలకోసం పోరాడి ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు, అలియాస్ కమలాకర్ మృతదేహం శుక్రవారం సాయంత్రం రాణాపూర్ గ్రామం చేరుకుంది. ఈనెల ఒకటో తేదీన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏగోలపు మల్లయ్యతోపాటు మరో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయం విధితమే. బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని, విషమిచ్చి చిత్రహింసలకు గురిచేసి చంపారని, పౌర హక్కుల సంఘం నాయకులు, ఏగోలపు మల్లయ్య భార్య మీనా హైకోర్టును ఆశ్రయించారు. బంధువుల సమక్షంలో రీ పోస్టుమార్టం చేయాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో ఆరు రోజులుగా మృతదేహం ఏటూరునాగారం దవాఖానలోనే ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు రీ పోస్టుమార్టం నిర్వహించి, శుక్రవారం మధ్యాహ్నం ఏగోలపు మల్లయ్య భార్య మీనా, సోదరులు ఏగోలపు రాజయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్‌లకు అప్పగించారు. శుక్రవారం సాయంత్రం 5. 50 నిముషాలకు మృతదేహం గ్రామానికి చేరింది. మల్లయ్యను కడసారి చూసుకునేందుకు చిన్ననాటి స్నేహితులు, గ్రామస్తులు, పౌరహక్కుల సంఘం నాయకులుపెద్ద సంఖ్యలో గ్రామానికి చేరారు.

### నేడు అంత్యక్రియలు

ఉద్యమాల ఖిల్లా రాణాపూర్ గ్రామం నుంచి ఉవ్వెత్తున ఎగిసిన మావోయిస్టులు ఎందరో ఉన్నారు. పదుల సంఖ్యలో గ్రామం నుంచి ఉద్యమంలో చేరి నేలకొరిగారు. 1992లో అజ్ఞాతంలోకి వెళ్లిన ఏగోలపు మల్లయ్య తల్లిదండ్రుల కడసారి చూపునకు సైతం రాలేదు. అకుంఠిత దీక్షతో ఉద్యమంలో 32 ఏళ్లపాటు కొనసాగిన మల్లయ్య మృతదేహాన్ని గ్రామస్తులు, చుట్టుపక్కల వారి సందర్శనకోసం ఉంచి, శనివారం మధ్యాహ్నం పౌరహక్కుల సంఘం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు హాజరై అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

### ఉద్యమాల ఖిల్లా రాణాపూర్ గ్రామం

చుట్టూ గుట్టలు..పచ్చని పంటచేన్లతో కళకళలాడిన రాణాపూర్ గ్రామంలో 40 ఏళ్ల మావోయిస్టు ఉద్యమానికి ఊపిరి ఊదిన గ్రామంగా ముద్రపడింది. 1978 నుంచి పెద్దపల్లి డివిజన్‌లో రాణాపూర్ గ్రామం కేంద్రంగా మావోయిస్టు ఉద్యమాన్ని గ్రామానికి చెందిన బయ్యపు దేవేందర్ రెడ్డి భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఆరంభించారు. బయ్యపు దేవేందర్‌రెడ్డి ఈ ప్రాంతంలో విస్తరించగా, ఉద్యమంలో రాణాపూర్ గ్రామం నుంచే పదుల సంఖ్యలో యువకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. గ్రామానికి చెందిన ఎరుకల ఎల్లయ్య, మడిపెల్లి కనకయ్యఅలియాస్ సాగర్, మడిపెల్లి కనకలక్ష్మి గతంలో ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. మిగతా కొంత మంది లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. సుమారు మూడు దశాబ్దాలు గ్రామంలో తెల్లవారితే పోలీసులు, గ్రేహౌండ్స్ దళాల బూట్ల శబ్దంతో అట్టుడికింది. ఇంత కాలం గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య అజ్ఞాతంలో ఉద్యమం నడుపుతున్నాడని గ్రామస్తులు చెప్పుకునేవారు. మల్లయ్య మృతి చెందడంతో మావోయిస్టు ఉద్యమానికి రాణాపూర్ గ్రామానికి రుణానుబంధం దూరమైందని పలువురు పేర్కొంటున్నారు.

## అవార్డుకు ఎంపికైన చిల్లపలి పంచాయతీ



చిల్లపల్లి గ్రామ పంచాయతీ

మంథని రూరల్, డిసెంబర్ 6: మండలంలోని చిల్లపల్లి గ్రామ పంచాయతీ వుమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డుకు ఎంపికైనట్లు మాజీ సర్పంచ్ కొమ్ము పద్మ సమ్మయ్య గురువారం తెలిపారు. ధీన్ దయాల్ పంచాయతీ వికాస్ పురస్కార్ కేటగిరిలో భాగంగా గ్రామ పంచాయతీ ఈ అవార్డుకు ఎంపికైనట్లు వెల్లడించారు. గ్రామ పంచాయతీకి అవార్డుకు రావడం చాలా సంతోషంగా ఉందని, అవార్డు సాధించడానికి సహకారం అందించిన మాజీ ఎంపీటీసీ గుమ్మడి సత్యవతి రాజయ్య, వార్డు సభ్యులు, గతంలో ఇక్కడ పని చేసిన కార్యదర్శి ఝాన్సీ, సీఏ సౌజన్య, మహిళా గ్రూప్ సంఘాల సభ్యులు, గ్రామంలోని మహిళలకు, ఆశ వర్కర్ ప్రమీ, మేట్ లలితలతో ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## యువతి వివాహానికి సాయం

జూలపల్లి, డిసెంబర్ 6 : జూలపల్లిలో ఓ నిరుపేద యువతి వివాహానికి తనవంతు సాయం అందించడానికి సర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు దారబోయిన నరసింహంయాదవ్ ముందుకు వచ్చారు. చిగురు మౌనికను ఆశీర్వదించి రూ. 7,500 విలువైన బియ్యం అందజేశారు. ఇక్కడ నాయకులు కొమ్మ పోశాలు, సిరికొండ కొమురయ్య, మేర్గు రమేశ్, గౌస్ పాషా, కూసి రాజయ్య, రవి పాల్గొన్నారు.

## కనుల పండువగా ఆదివరాహ స్వామి కల్యాణం



కల్యాణత్సవం జరిపిస్తున్న అర్చకులు

కమాన్‌పూర్, డిసెంబర్ 6ః మండలంలోని స్వయంభుగా వెలిసిన ఆదివరాహ స్వామి క్షేత్రంలో శుక్రవారం స్వామి వారి కల్యాణోత్సవం వేడుకలు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. కార్తీక మాసంలో స్వామివారి శ్రావణ నక్షత్రంను పురస్కరించుకొని స్వామివారి క్షేత్రంలోని కల్యాణ మండపంలో ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి స్వామి వారితో శ్రీదేవి భూదేవిలతో కల్యాణ మహోత్సవంను వేద పండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలువురు దాతలు అన్నదానం చేశారు.

## యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా అవినాశ్



అవినాశ్

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 6: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బొంకూరి అవినాశ్ అత్యధిక మెజార్టీతో ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ పద్ధతి లో బుధ, గురువారాల్లో ఎన్నికలు నిర్వహించారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, సీనియర్ నాయకులు జనక్‌ప్రసాద్, హర్కార వేణుగోపాలరావులకు అవినాశ్ కృతజ్ఞతలు తెలిపారు.

### నియోజకవర్గ అధ్యక్షుడిగా అజయ్

ధర్మారం,డిసెంబర్ 6: మల్లాపూర్ గ్రామానికి చెందిన ఆశోద అజయ్ యూత్ కాంగ్రెస్ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవి ఎన్నిక కోసం నియోజకవర్గంలో పోటీని నిర్వహించారు. ఈ పోటీలో అజయ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా అజయ్ ను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు పలువురు అభినందించారు.

## రక్తదాన శిబిరం

గోదావరిఖని, డిసెంబర్ 6: తలసేమియా వ్యాగ్రస్తుల సహాయార్థం పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకులో శుక్రవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపార వేత్త, బ్యాంకు ఖాతాదారుడు కోలేటి శ్రీనివాస్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రామగుండం బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ విద్యాసాగర్, ఆపరేషన్ మేనేజర్ కుమారస్వామి, ఎన్టీపీసీ బ్రాంచీ మేనేజర్ శ్రీనివాస్, సంజీవ్, సిబ్బంది, రెడ్‌క్రాస్ సోసైటీ సభ్యులు ఉన్నారు.

## హన్మంతునిపేటలో వైద్యశిబిరం

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 6: హన్మంతునిపేటలో యజ్ఞ ఎన్‌లైట్ సొసైటీ వ్యవస్థాపకుడు పల్లె శాంతిరాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్యశిబిరం నిర్వహించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమలత, హెలెనా, అర్పనా, అక్షయ, దేవమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

## పంటల సాగుపై రైతులకు అవగాహన

ధర్మారం, డిసెంబర్ 6: యాసంగి సీజన్‌లో రైతులు సన్నరకం వరి సాగు చేయడం ఎంతో మేలని ఇన్చార్జి ఏవో బీ ప్రమోద్ కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. వరి నారుమడులను పరిశీలించారు. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

## యువకులకు క్రీడా పోటీలు

ధర్మారం ,డిసెంబర్ 6: జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం, పత్తిపాక యువశక్తి యూత్ ఆధ్వర్యంలో నంది మేడారం బాలుర గురుకుల విద్యాలయం ఆవరణలో శుక్రవారం బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ విద్యాసాగర్ రావు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంజు, ఎన్‌ఆర్ఐ దాగేటి ఉదయ్ యాదవ్, ఎన్వైకే వలంటీర్ మహేశ్, యువశక్తి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్ ,ఉపాధ్యక్షుడు రిషి ఇర్ఫాన్ ,జూడో సీనియర్ ప్లేయర్ మహేష్, పీటీలుగా శ్రీధర్ సార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు దివ్యాంగుల దినోత్సవం

రామగిరి, డిసెంబర్ 6: సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో డబ్ల్యూపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక రాణీ రుద్రమదేవి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో శనివారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించనున్నట్లు పర్సనల్ విభాగాధిపతి సుదర్శనం తెలిపారు. దివ్యాంగులకు క్రీడలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. సెంటినరీకాలనీ, పరిసర ప్రాంతాల్లో దివ్యాంగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నేడు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి షష్టి

మంథని, డిసెంబర్ 6: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీసుబ్రమణ్యస్వామి షష్టి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించేందకు ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు, అయ్యప్ప దీక్షాపరులు ప్రత్యేకంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. సుబ్రమణ్యస్వామి షష్టి సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా ఆలంకరించడంతో పాటు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయంలో వేదోక్తంగా నిర్వహించనున్నారు.

## దివ్యాంగుల దినోత్సవం

ముత్తారం, డిసెంబర్ 6 :ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ముత్తారం ఎంఈవో కార్యాలయం లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ బాలలకు క్రీడా పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. దివ్యాంగ పిల్లలను భారంగా భావించకుండా భరోసానిచ్చే విధంగా ప్రోత్సహించాలని ఎంఈవో ఓదెలు అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు ఉన్నారు,